క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కోడూరు: అవనిగడ్డలోని 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో శనివారం కోడూరులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఏడీఈ నడకుదుటి సుబ్రహ్మణ్యేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మండల వ్యాప్తంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

297 మందికి ట్యాబ్‌ల పంపిణీ

నాగాయలంక: మండలంలో ఎనిమిదో తరగతి చదువుతున్న 297మంది విద్యార్థులకు బైజూస్ ట్యాబ్‌లు అందజేశామని నాగాయలంక ఎంఈఓ-2 అన్నపరెడ్డి రామారావు శుక్రవారం తెలిపారు. అయిదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఏడు ప్రాథమికోన్నత పాఠశాలల్లో చదువుతున్న 146 మంది బాలికలు, 151 మంది బాలురకు వీటిని అందజేశామని చెప్పారు.

భక్తిశ్రద్ధలతో అయ్యప్ప పేటతుళ్లి



కోడూరు: అయ్యప్ప మాలధారులు పేటతుళ్లి కార్యక్రమాన్ని శుక్రవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మాలధారులు కోడూరులోని అయ్యప్ప స్వామి దేవాలయం నుంచి డప్పువాయిద్యాల నడుమ విచిత్ర వేషధారణలతో గ్రామమంతా ఊరేగింపుగా వెళ్లి పేటతుళ్లి ఆడారు. మహిషి రాక్షసుడిని అయ్యప్ప వధిస్తున్నట్లుగా దీక్షదారులు చేసిన నృత్యం ఆకట్టుకుంది.

మర్రిపాలెం మాజీ సర్పంచి బండ్రెడ్డి మృతి



మర్రిపాలెం(నాగాయలంక): మర్రిపాలెం గ్రామ మాజీ సర్పంచి బండ్రెడ్డి నాగేశ్వరరావు (85) అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతిచెందారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆయన రెండు సార్లు సర్పంచ్‌గా సేవలందించారు. భావదేవరపల్లి సర్పంచి మండలి ఉదయభాస్కర్, మాజీ సర్పంచ్‌లు బండ్రెడ్డి గోపాలరావు (బోస్), మెండు లక్ష్మణరావు తదితరులు ఆయన భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు.

అన్నసమారాధన



కృత్తివెన్ను: గత ఐదు రోజులుగా కృత్తివెన్ను మండలం గాంధీనగరంలోని నాగవిఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో జరుగుతున్న షష్ఠి ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కృత్తివెన్నులో ప్రసిద్ధి గాంచిన ఆంజనేయస్వామివారి దేవస్థానం వద్ద శుక్రవారం నుంచి హనుమద్ వ్రతం పూజలు ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు.

నిత్యావసర వస్తువులు, వస్త్రాలు అందజేత

పురిటిగడ్డ(చల్లపల్లి): నిరుపేదల సేవతోనే నిజమైన సంతృప్తి లభిస్తుందని ఇండియా విలేజ్ మినిస్ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ డైరెక్టర్ డాక్టర్ వేములపల్లి సురేష్ అన్నారు. శుక్రవారం సాయంత్రం పురిటిగడ్డలోని ఐవీఎం కార్యాలయం వద్ద పురిటిగడ్డ, నడకుదురు, నిమ్మగడ్డ, యార్లగడ్డ గ్రామాలకు చెందిన 90 మంది నిరుపేద వృద్ధులు, వితంతువులకు రూ.లక్ష వ్యయంతో నిత్యావసర సరుకులు, నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ ఐవీఎం ఆధ్వర్యంలో రెండు దశాబ్దాలకు పైగా సమాజానికి, పేదలకు సేవ చేస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఐవీఎం డైరెక్టర్ వేములపల్లి రోజా, విజయ, సోఫీ పాల్గొన్నారు.

పొదుపు ఖాతా ఉంటేనే ప్రభుత్వ ప్రయోజనాలు

గూడూరు: ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో పొదుపు ఖాతా కలిగి ఉండాలని, తద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధి పొందవచ్చునని కేడీసీసీ బ్యాంక్ గూడూరు మేనేజర్ ఫణికృష్ణ అన్నారు. కృష్ణాజిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో నాబార్డు సౌజన్యంతో గూడూరు మండలం తుమ్మలపాలెం, ఆకుమర్రు గ్రామాల్లో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా ప్రదర్శనలు నిర్వహించారు. వై.వీరయ్య ఆధ్వర్యంలోని రవితేజ కళాజాతా సభ్యులు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు.

● **కోనేరుసెంటర్:** కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ఆధ్వర్యంలో శుక్రవారం సుల్తానగరంలో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాజాతా బృందం గ్రామీణ, పట్టణ ప్రజలకు సహకార బ్యాంకు అందిస్తున్న సేవలు, రుణ సౌకర్యాలు, పొదుపు ఖాతాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించారు.

శాంతి, ప్రేమకు ప్రతిరూపం ఏసుక్రీస్తు

● మంత్రి జోగి రమేష్
● ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు



ఆకుమర్రులో కేక్ కట్ చేస్తున్న మంత్రి జోగి రమేష్

గూడూరు: శాంతి, ప్రేమకు ఏసుక్రీస్తు ప్రతీక అని, ఆయన జన్మించిన డిసెంబర్ నెలకు ప్రత్యేకత ఉందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండలంలోని ఆకుమర్రు గ్రామంలో స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కారుమంచి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజలంతా క్రిస్మస్ పండుగను జరుపుకుంటారని చెప్పారు. ముఖ్యంగా భారతదేశంలో నెల రోజుల పాటు పండుగ వాతావరణం ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ నెరవేరుస్తున్నారని, దేవుని దయతో వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధిస్తుందన్నారు. ఈ మేరకు సంఘ సేవకులు అందరూ ఏసయ్యను ప్రార్థించాలని కోరారు. అనంతరం స్థానిక ప్రజాప్రతినిధులు పాస్టర్లతో కలిసి మంత్రి కేక్ కట్ చేశారు. గాయకులు ఆలపించిన క్రీస్తు గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గూడూరు మండల పాస్టర్ల సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున క్రైస్తవులు పాల్గొన్నారు.

కొమ్మారెడ్డి హైస్కూల్‌లో..

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్‌లో శుక్రవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రిస్మస్ తాత వేష ధారణలో పలు కార్యక్రమాలు నిర్వహించి అలరించారు. పాఠశాల డైరెక్టర్ కె. కిషోర్ ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణిత పితామహుడు శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా కిషోర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. విద్యార్థులు తయారు చేసి ఏర్పాటు చేసిన సైన్స్ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. జయంతి సందర్భంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

● **పెడన:** స్థానిక దక్షిణ తెలుగుపాలెంలో సిరివెళ్ల రమణరాజు ఏర్పాటు చేసిన సెమీ క్రిస్మస్ వేడుకలకు మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారితో కలిసి మంత్రి జోగి రమేష్ తనయుడు జోగి రాజీవ్ హాజరయ్యారు. ప్రజలంతా క్రిస్మస్ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు. కేక్ కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. బ్రదర్ నాగిశెట్టి డానియేల్, కృపమ్మ, బ్రదర్ పల్లి శామ్యూల్, కౌన్సిలర్ జయేష్, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ వేడుకలో మాట్లాడుతున్న రాజీవ్



కొమ్మారెడ్డి హైస్కూల్‌లో సెమీ క్రిస్మస్ వేడుకలు

పేదల జీవితాల్లో వెలుగులు

మేయర్ వెంకటేశ్వరమ్మ



మచిలీపట్నంటౌన్: రాష్ట్రంలోని పేదల జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం నగరంలోని 22, 24 డివిజన్లలో శుక్రవారం నిర్వహించారు. ఆయా డివిజన్లలో సంక్షేమ బోర్డులను, పార్టీ పతాకాలను ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రాష్ట్రంలో పేదరిక నిర్మూలనే ధ్యేయంగా పాలన చేస్తున్నారన్నారు. దీనిలో భాగంగానే నవరత్న పథకాలతో పాటు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఆదుకుంటున్నారని తెలిపారు. సంక్షేమ పథకాలతో పేదల కుటుంబాల్లో మార్పుల చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, కార్పొరేటర్లు ఏకశిరి వెంకటేశ్వరరావు, చిత్తజల్లు ప్రసన్న, మేకల సుబ్బన్న, పల్లి శేఖర్, వైఎస్సార్ సీపీ నాయకులు చిత్తజల్లు రాజు, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ముక్కోటికి ఆలయాలు ముస్తాబు

నేడు ఉత్తరద్వార దర్శనం

కోడూరు: మహావిష్ణువు గరుడ వాహనంపై మూడు కోట్ల దేవలతో భూలోకానికి దిగి వచ్చి భక్తులకు దర్శనమిచ్చే ముక్కోటి ఏకాదశి పర్వదినానికి వైష్ణవాలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణస్వామి వారి ఆలయంలో శనివారం ఉదయం 5.40 గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ శుక్రవారం తెలిపారు. ఉత్తరద్వారంగా స్వామి వారిని దర్శించుకుంటే సర్వశుభాలు కలుగుతాయని స్వామీజీ చెప్పారు. కోడూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ఉదయం 5 గంటల నుంచి భక్తులకు ముక్కోటి దర్శనాలకు అవకాశం కల్పిస్తామని ధర్మకర్త కోట పద్మావతి వరప్రసాద్ తెలిపారు. ముక్కోటిని పురస్కరించుకుని ఆలయాలను వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయక స్వామి ఆలయం, బచ్చుపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, రుస్తుంబాదలోని భద్రాద్రి రామాలయం, బలరామునిపేటలోని యతిరాజభవనం, గొడుగుపేట వేంకటేశ్వరస్వామి ఆలయం, చల్లరాస్తా సెంటర్‌లోని వేణుగోపాలస్వామి ఆలయం, నిజాంపేటలోని బొబ్బిల్లి వేణుగోపాల స్వామి ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ద్వారా స్వామివారు దర్శనం ఇవ్వనున్నారు. ఆలయాల వద్ద ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారిని వివిధ వాహనాలపై ఊరేగించేందుకు సన్నాహాలు చేశారు. రంగనాయకస్వామి ఆలయంలో స్వామివారు శుక్రవారం జగన్మోహిని అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

వేణుగోపాల స్వామి ఆలయంలో..

పెడన: పట్టణంలోని రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం నుంచి రెండు రోజుల పాటు ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు నిర్వహించనున్నారు. దేవస్థానాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. శనివారం ఉదయం వేకువ జాము ఐదు గంటల నుంచి స్వామి వార్ల ఉత్తర ద్వారా దర్శనం, అర్చన, తీర్థప్రసాద వినియోగం ఉంటాయి. సాయంత్రం 6.30 గంటలకు రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణోత్సవం, అదివారం ఉదయం 8.30 గంటలకు మహా సుదర్శన హోమం జరుగుతాయి. 11 గంటలకు మహా పూర్ణాహుతి, నీరాజనం, తీర్థప్రసాద వినియోగం ఉంటాయి. సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందని ఆలయ ఈఓ మోహనరావు తెలిపారు.



ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణుడు



జగన్మోహిని అలంకారంలో రంగనాయకస్వామి



విద్యుత్ దీపాల వెలుగులో పెడన వేణుగోపాలస్వామి దేవస్థానం

దాతల సేవలు అభినందనీయం

● ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
● వి.కొత్తపాలెంలో నూతన బస్‌షెల్టర్ ప్రారంభం

కోడూరు: గ్రామాల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న దాతల సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన కోసూరు రామమోహనరావు వృత్తి రీత్యా హైదరాబాద్‌లో స్థిరపడగా, సొంత ఊరిపై మమకారంతో అదే గ్రామంలో నూతన బస్‌షెల్టర్‌ను నిర్మించారు. రూ.8 లక్షల వ్యయంతో నిర్మించిన బస్ షెల్టర్‌ను ఎమ్మెల్యే రమేష్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. వృత్తిరీత్యా ఇతర ప్రాంతాల్లో స్థిరపడిన వారు తమ సొంత గ్రామాల అభివృద్ధికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. ఎన్ఆర్ఐలు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. బస్ షెల్టర్‌ను నిర్మించిన రామమోహనరావును ప్రత్యేకంగా అభినందించారు. తమ తల్లిదండ్రులు కోసూరు బాబూరావు, కమల పేర్ల మీద ఈ బస్‌షెల్టర్‌ను నిర్మించడం సంతోషంగా ఉందని రామమోహనరావు తెలిపారు. సర్పంచి యలవర్తి నాంచారయ్య, గ్రామ పెద్దలు కోసూరు రూపానంద్, నాగేశ్వరరావు, హేమాంబంధరరావు, రమేష్‌బాబు, వైస్ ఎంపీపీ ముక్కు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బస్‌షెల్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

మధ్యాహ్న భోజనం నిర్వహణకు సాయం

పెడన: పట్టణంలోని బొడ్డు నాగయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కల్పించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని కళాశాల ప్రిన్సిపాల్ కేసీఎస్‌వీ రామారావు అన్నారు. శుక్రవారం ఆర్యవైశ్య పెడన పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కొల్లూరి సత్యనారాయణ (చిన్నా) కొల్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కళాశాల విద్యార్థులకు పది రోజులు పాటు భోజనం కల్పించేందుకు ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు 100 రోజుల మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా పది రోజులపాటు భోజనాలు ఏర్పాటు చేసి మరోసారి తన దాతృత్వాన్ని చిన్నా చాటుకున్నారని చెప్పారు. చిన్నా, మంజులత దంపతులతో పాటు కుమార్తె ప్రేమాన్వితను ఘనంగా సత్కరించారు. అనంతరం విద్యార్థులకు భోజనాలను వడ్డించారు. అధ్యాపకులు పేరిశెట్టి నాగరవి, వరుదు నిరంజన్, ఆవుల ఉదయ భాస్కర్, సైదా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న చిన్నా దంపతులు

ఘనంగా జాతీయ గణిత దినోత్సవం

పెడన: మండలంలోని చేవెంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు రాజేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు మణికుమార్, రవిచంద్ర తదితరులు గణిత మేధావి శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు వ్యాసరచన, గణిత నమూనాల ప్రదర్శన పోటీలను నిర్వహించారు. గణితంలో ముగ్గుల ప్రదర్శన, వ్యాసరచన పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. జాతీయ గణిత దినోత్సవం ప్రాముఖ్యతను విద్యార్థులు వివరించి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బసవేశ్వరరావు, దుర్గ, భానుశ్రీ, రమేష్, సాంబశివరావు, శారద తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నంలో..

మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాజుపేటలోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్ర జాతీయ బోధనా కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ శాస్త్రి పాల్గొన్నారు. గణితం అంటే భయం పోయేందుకు విద్యార్థులు గణిత నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ కారుమూరి రాజేంద్రప్రసాద్, పరిషత్ కార్యదర్శి శాస్త్రి తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్రభారతి స్కూల్‌లో రామానుజన్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా మ్యాథ్స్ ఎక్స్‌పో నిర్వహించారు. ఎక్స్‌పో లో విద్యార్థులు ప్రదర్శించిన పలు ఎగ్జిబిట్లు ఆకట్టుకున్నాయి.



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

చల్లపల్లి: జాతీయ రహదారి -216పై చల్లపల్లి వద్ద వ్యాన్‌ను కంటైనర్ లారీ ఢీకొట్టడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లికి చెందిన తొమ్మిది మంది విజయవాడలో పెళ్లికి వెళ్లి తిరిగి వ్యాన్‌లో బయలుదేరారు. వ్యాన్ చల్లపల్లి-పెద్దకళ్లేపల్లి రోడ్డులో హైవే దాటుతుండగా వేగంగా దూసుకు వచ్చిన కంటైనర్ లారీ ఢీ కొట్టింది. ప్రమాదంలో వ్యాన్‌లో ప్రయాణిస్తున్న 70 ఏళ్ల వృద్ధురాలు జెట్టిబోయిన వెంకట సుబ్బమ్మ, పోతురాజు బ్రహ్మయ్య, రావి లోకేశ్వరి, సంగా వినీత్ కుమార్, కొంగిడాల నాగపుష్పకు గాయాలయ్యాయి. వీరితో పాటు ఆటో పక్క నుంచి వెళుతున్న ద్విచక్ర వాహనదారుడు అడపా బాల సాయి కిరణ్ గాయపడ్డాడు. బాధితులను 108 వాహనంలో చల్లపల్లి ప్రభుత్వాస్పత్రికి తీసుకువెళ్లగా ప్రాథమిక చికిత్స అనంతరం వారిని మచిలీపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ గుర్తింపు

అవనిగడ్డ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బి డబుల్ ప్లస్ గ్రేడ్ వచ్చిందని ప్రిన్సిపాల్ డి. ఉమారాణి తెలిపారు. ఈ నెల 14, 15 తేదీల్లో కాలే జీని నాక్ బృందం సందర్శించి సమగ్రంగా పరిశీలన చేశారు. శుక్రవారం డిగ్రీ కళాశాలకు బి ప్లస్ గ్రేడ్ ప్రకటించారు. గతంలో కంటే గ్రేడ్ మెరుగు పడిందని, ఏ గ్రేడ్‌కు తీసుకువెళ్లేలా కృషి చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్

మోపిదేవి: జాతీయ రహదారి 216పై జరిగే రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ తెలిపారు. మోపిదేవి అవుట్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం రికార్డులను తనిఖీ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ వార్షిక తనిఖీల్లో భాగంగా ఓపీ స్టేషన్‌ను పరిశీలించామన్నారు. జాతీయ రహదారి 216 హైవే రోడ్డు కావడం, దగ్గర దగ్గరగా చిన్నచిన్న గ్రామాలు కనెక్టు కావడంతో ప్రజలకు సరైన అవగాహన లేక తమ వాహనాలతో వేగంగా హైవే పైకి రావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. వీటి నివారణకు నేషనల్ హైవే వారితో మాట్లాడి సిగ్నల్స్ ఏర్పాటు చేయిస్తామన్నారు. అవుట్ పోలీస్ స్టేషన్ కావడం వల్ల సిబ్బంది కొరతగా ఉందని, ఈ విషయాన్ని ఎస్పీ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దఎత్తున భక్తులు రావడంతో ట్రాఫిక్ సమస్య రాకుండా దేవస్థానం వారితో మాట్లాడి బందోబస్తుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్టేషన్ కింద 26 గ్రామాలు ఉన్నందున రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని అనుసరించాల్సి అంశాలను చర్చించామని వివరించారు. తరచూ గ్రామాల్లో చోరీలు జరుగుతున్న విషయాన్ని డీఎస్పీ దృష్టికి తీసుకురాగా, ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గట్టి చర్యలు తీసుకోవాలని ఎస్ఐని ఆదేశించారు. చల్లపల్లి సీఐ నాగప్రసాద్, ఎస్ఐ కేవీవీ సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అయోధ్య రాముని అక్షింతలు సిద్ధం

బంటుమిల్లి: గ్రామానికి చేరుకున్న అయోధ్య రాముని అక్షింతలకు 300 కిలోల బియ్యంను కలిపి బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లోని 100 గ్రామాల్లో ఇంటింటికీ పంచేందుకు సిద్ధం చేశారు. శుక్రవారం పాశ్చాపురం ఆంజనేయస్వామి ఆలయంలో పలువురు భక్తులు వీటిని తయారు చేశారు. తొలుత పండితులు హనుమంతాచార్యులు వేదమంత్రాలతో పూజలు చేశారు.


● **పాగోలు(చల్లపల్లి):** అయోధ్య రామయ్య అక్షింతలు ప్రతి ఇంటికీ అందిస్తామని విశ్వ హిందూ పరిషత్ చల్లపల్లి ప్రఖండ అధ్యక్షుడు అడపా రవి తెలిపారు. శుక్రవారం అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను పాగోలు రామాలయంలో ఉంచి నిత్య పూజలు ప్రారంభించారు.


గాజు టీ గ్లాసులను మాత్రమే వినియోగించాలి

చల్లపల్లి: టీ స్టాల్స్ నిర్వాహకులు నిబంధనల ప్రకారం గాజు టీ గ్లాసులను మాత్రమే వినియోగించాలని పంచాయతీ ఈఓ పేర్ని మాధవేంద్రరావు అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ ఆధ్వర్యంలో టీస్టాల్స్ నిర్వాహకులకు ఉచితంగా టీ గాజు గ్లాసులు పంపిణీ చేశారు. వేడి వేడి పదార్థాలు, టీ, కాఫీ విక్రయాలకు పేపర్ కప్పులు వినియోగించవద్దని చెప్పారు. జూనియర్ అసిస్టెంట్ అనిత తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పేర్ని నాని జన్మదిన వేడుకలు

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) జన్మదిన వేడుకలను స్వగృహంలో కుటుంబ సభ్యులతో జరుపుకున్నారు. గురువారం అర్ధరాత్రి పేర్ని నాని కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి తల్లిదండ్రుల నుంచి ఆశీర్వాదం పొందారు. గురువారం అర్ధరాత్రి రామానాయుడుపేట సెంటర్‌లో నాని చిత్రపటానికి అభిమానులు క్షీరాభిషేకం చేసి కేక్ కట్ చేశారు. రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ జక్కుల ఆనంద్‌బాబు, మద్దెల పాండురంగారావు, బేతపూడి రవి తదితరులు పాల్గొన్నారు. మాజీ కౌన్సిలర్ చిటికిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈడేపల్లి జెట్టి నరసింహం ప్రభుత్వ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, మునిసిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, బూరగడ్డ రమేష్‌నాయుడు, కార్పొరేటర్లు వృద్ధులకు, వికలాంగులకు భోజనం వడ్డించారు. లంకా సూరిబాబు, కార్పొరేటర్లు జోగి చిరంజీవి, ఐనం తాతారావు, పల్లి శేఖర్ తదితరులు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు అనిశెట్టి ధనుంజయ ఆధ్వర్యంలో నగరంలోని ప్రభుత్వ శిశుగృహలోని చిన్నారులకు నూతన వస్త్రాలు, పాలు, పండ్లు పంపిణీ చేశారు. పోర్టురోడ్డు, సుకర్లాబాద్, చిలకలపూడి, రాజుపేట, మంగినపూడి ప్రాంతాల్లోని వృద్ధాశ్రమాల్లో అన్నదానం చేశారు. 3వ డివిజన్‌లో, 38వ డివిజన్‌లో, నాగపోతరావు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద, 16 డివిజన్‌లో, స్థానిక గాడెల్లి కల్యాణ మండపంలో, బందరు మండలం పెదపట్నంలో నాయకులు కేక్‌లు కట్‌చేసి పంచిపెట్టారు.





ఈడేపల్లి వృద్ధాశ్రమంలో వేడుకలు. (ఇన్‌సెట్) పేర్ని నానికి కేక్ తినిపిస్తున్న సతీమణి జయసుధ.

పంట నష్టం జాబితాల ప్రదర్శన

మోపిదేవి: మిచాంగ్ తుపానుకు పంటలు దెబ్బతిన్న రైతుల వివరాలతో కూడిన జాబితాలను ఆర్‌బీకేల్లో ప్రదర్శించామని మండల వ్యవసాయాధికారి హెబ్సిబా రాణి తెలిపారు. ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలకు దెబ్బతిన్న వరి పొలాలను నమోదు చేసి ఆ లిస్టును ఆర్‌బీకేలలో ప్రదర్శించామని చెప్పారు.

గీతామందిరంలో ధనుర్మాస పూజలు



చల్లపల్లి: ధనుర్మాసోత్సవాలు స్థానిక గీతా మందిరంలో వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఉదయం ఆర్యవైశ్య సంఘ భవనంలోని గీతా మందిరంలో శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు, విష్ణు సహస్ర నామార్చన నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ కార్యదర్శి వరదా హరిగోపాల్, తమ్మన సతీష్, కొత్త శ్రీను, నాగమణి, దింటకుర్తి జ్యోతి, ప్రమీల ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం ఉదయం గీతామందిరంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఉదయం ఐదు గంటలకు ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశామని సంఘ అధ్యక్షుడు అన్నవరపు పాండురంగారావు తెలిపారు. తిరుప్పావై పాశుర విన్నపాలు, ప్రత్యేక పూజలు జరుగుతాయని వివరించారు.